క్లుప్తంగా

విద్యార్థులకు కిట్లు పంపిణీ



విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: తేలుకుంచి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, సర్పంచ్ పాతిర్ల రాజశేఖర రెడ్డి యూనిఫాం, పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన జరుగుతుందన్నారు. పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు బి.నాగేశ్వరరావు, గ్రామ పెద్ద మేరుగు సూర్యనారాయణ పాల్గొన్నారు.

గేదెల అక్రమ రవాణాకు అడ్డుకట్ట



పోలీసులు పట్టుకున్న పశువుల రవాణా వాహనం

కవిటి: గేదెలను అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. కవిటి మండలంలోని 16వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం ఉదయం ఒడిశాలోని గోలంత్ర నుంచి తిలారు సంతకు అక్రమంగా ఆరు గేదెలను వాహనంలో తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న కవిటి ఎస్సై వి.రవివర్మ తన సిబ్బందితో వాహనాన్ని అడ్డుకున్నారు. కోటబొమ్మాళి మండలం నారాయణవలసకు చెందిన డి ప్రకాశరావు వీటిని ఒడిశాలో కొనుగోలుచేసి తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. పట్టుబడిన ఆరు గేదెలను కొత్తవలసలో నిర్వహిస్తున్న హెల్పింగ్‌హ్యాండ్స్ సంస్థకు తరలించినట్లు ఎస్సై చెప్పారు.

బాలకృష్ణాపురంలో పారిశుద్ధ్య పనులు



వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్...

ఇచ్ఛాపురం రూరల్: బాలకృష్ణాపురం గ్రామంలో పారిశుద్ధ్య పనులు ప్రారంభమయ్యాయి. 'మురికి కూపంగా బాలకృష్ణాపురం' శీర్షికన ఈ నెల 11వ తేదీన 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఎంపీడీవో కె.రామారావు స్పందించారు. శనివారం గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలువల్లో పూడిక తీయించి అంటు వ్యాధులు సోకకుండా బ్లీచింగ్ పౌడర్‌ను పిచికారీ చేయించారు.

500 సారా ప్యాకెట్లతో వ్యక్తి అరెస్టు



స్వాధీనం చేసుకున్న సారా, బైక్‌తో ఎక్సైజ్ పోలీసులు

కంచిలి: మఠం సరియాపల్లి పంచాయతీ రాగుపురం గ్రామానికి చెందిన నర్తు హేమరాజు 500 సారా ప్యాకెట్లను ద్విచక్ర వాహనంతో రవాణా చేస్తుండగా శ్రీకాకుళం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సోంపేట ఎక్సైజ్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. హేమరాజును అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించారు. ఇతనిపై గతంలో కూడా పలు సారా కేసులు నమోదైనట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాసరావు, సోంపేట ఎక్సైజ్ సీఐ జి.వి.రమణ, ఎస్ఐ సుజాత, సిబ్బంది భాను ప్రసాద్, విజయ్, గాలిబ్, రమణ, వెంకటేష్ పాల్గొన్నారు.

మున్సిపల్ దుకాణాలకు వేలం

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలోని ఆస్పత్రి రోడ్డు, మెయిన్ రోడ్డులో పది దుకాణాలకు సంబంధించి మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ వేలం నిర్వహించారు. పురపాలక కార్యాలయం ఆవరణలో జరిగిన ఈ వేలంలో 35 మంది పోటీపడ్డారు. అందులో 20 మంది మాత్రమే దరఖాస్తు చేసుకోవడంతో ఎక్కువగా కోట్ చేసిన వారికి షాపులను కేటాయించనున్నట్లు కమిషనర్ స్పష్టం చేశారు. వీటి ఆమోదం కోసం కౌన్సిల్‌కు పంపించి తుది నిర్ణయం ప్రకటిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పి.మోహన్ రావు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

● ఈ నెల 14న సాక్షిలో ప్రచురితమైన ఈ వార్త శీర్షికలో 'పది మద్యం షాపులకు 20 మంది దరఖాస్తు' అని పొరపాటున ప్రచురితమైంది. 'పది షాపులకు 20 మంది దరఖాస్తు' అని చదువుకోగలరు.

కుమిలిపోతున్న కౌలు రైతులు!

● పట్టించుకోని కూటమి ప్రభుత్వం
● ఈ ఏడాది కానరాని గుర్తింపు కార్డులు
● వైఎస్సార్‌సీపీ సర్కార్‌లో 1558 మందికి గుర్తింపు కార్డులు అందజేత



ఖరీఫ్‌లో సాగు కోసం సిద్ధం చేసిన పంట పొలాలు

టెక్కలి: కూటమి ప్రభుత్వం రైతులు, వ్యవసాయరంగాన్ని పూర్తిగా విస్మరించిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అన్నదాత సుఖీభవ పేరుతో పెట్టుబడి సాయం అందజేస్తామని చెప్పిన చంద్రబాబు సర్కార్ ఖరీఫ్ సీజన్ ఆరంభమైనప్పటికీ ఏఒక్క రైతుకు పెట్టుబడి సాయం అందజేయలేదు. మరోవైపు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న కౌలు రైతుల పట్ల పూర్తిగా నిర్లక్ష్యాన్ని చూపుతోంది. గత వైఎస్సార్‌సీపీ సర్కార్ హయాంలో గుర్తించిన మేరకు గత ఏడాది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చారు. ఈ ఏడాది మాత్రం పూర్తిగా వారికి గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడంతో వ్యవసాయంపై ఆధారపడిన కౌలు రైతులు పెట్టుబడి సాయం కోసం అప్పులు చేస్తూ ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవానికి ఏప్రిల్ నెలలో గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ఆయా సభల ద్వారా కౌలు రైతులను గుర్తించి వారికి సీసీఆర్‌సీ (పంట సాగు హక్కు) పత్రాలను అందజేయాల్సి ఉంది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కౌలు రైతులను పూర్తిగా పట్టించుకునే పరిస్థితి లేదు. ప్రస్తుతం ఖరీఫ్ ఆరంభమవుతున్న నేపథ్యంలో ఇప్పటికే పంట పొలాలను సాగు కోసం సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో సాగు చేస్తున్న కౌలు రైతులు పెట్టుబడి సాయం కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు తమను గుర్తించి సాయం చేయాలని వేడుకుంటున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో 1558 మందికి సీసీఆర్‌సీ కార్డులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో టెక్కలి నియోజకవర్గంలో గుర్తించిన మేరకు గత ఏడాది 1558 మంది కౌలు రైతులకు రెన్యువల్ పేరుతో గుర్తింపు కార్డులు అందజేశారు. ఆ గుర్తింపు కార్డులతో బ్యాంకుల్లో రుణాలు, ఇతర వ్యవసాయ సంక్షేమ పథకాలు అందుకున్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. వైఎస్సార్‌సీపీ సర్కార్ హయాంలో ఇచ్చిన సీసీఆర్‌సీ కార్డులను గమనిస్తే.. టెక్కలి మండలంలో 588, నందిగాంలో 541, కోటబొమ్మాళిలో 205, సంతబొమ్మాళి మండలంలో 224 చొప్పున సీసీఆర్‌సీ కార్డులు ఇచ్చారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఆరంభమైనప్పటికీ కూటమి సర్కార్ కౌలు రైతుల గురించి ఇప్పటి వరకూ ఎలాంటి ఆలోచన చేయలేదు. దీంతో తమ పరిస్థితి ఏమిటో అర్థకాక ఆందోళన చెందుతున్నారు.

కౌలు రైతులను విస్మరించారు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వ్యవసాయంపై పూర్తిగా నిర్లక్ష్యం చూపుతున్నారు. వ్యవసాయంపై ఆధారపడి కౌలు చేస్తున్న రైతుల పరిస్థితి దయనీయంగా మార్చేశారు. గత వైఎస్సార్‌సీపీ సర్కార్ హయాంలో గుర్తించిన మేరకు గత ఏడాది రెన్యువల్ చేశారు. ఈ ఏడాది పూర్తిగా గుర్తింపు కార్డులు ఇవ్వలేదు.

–హెచ్.వెంకటేశ్వరరావు, రైతు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, టెక్కలి

విన్నవించినా స్పందించలేదు



కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని పలు మార్లు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నాలు చేసి అధికారులకు విన్నవించినా స్పందించలేదు. దీంతో ఈ ఏడాది ఖరీఫ్‌లో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు లేకపోవడంతో, పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారస్తులను ఆశ్రయిస్తూ ఇబ్బందులు పడుతున్నారు.

–ఎస్.షణ్ముఖరావు, సీపీఎం నాయకుడు, టెక్కలి

యోగాతో మానసిక ప్రశాంతత



ఇచ్ఛాపురం రూరల్: మండపల్లిలో యోగాసనాలు వేస్తున్న దృశ్యం



ఇచ్ఛాపురం రూరల్: టి.బరంపురంలో యోగాసనాల్లో మహిళలు

ఇచ్ఛాపురం రూరల్: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని తహసీల్దార్ ఎన్.వెంకటరావు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలో అన్ని పంచాయతీల్లో యోగాసనాలు కార్యక్రమాలను శనివారం నిర్వహించగా.. తహసీల్దార్ పర్యవేక్షించారు. యోగా ప్రయోజనాలను తెలియజేశారు.

కంచిలి: రోజు యోగా చేయడం ద్వారా మెరుగైన ఆరోగ్యం సాధ్యమని మకరాంపురం మండల పరిషత్ పాఠశాల హెచ్ఎం దుద్ది బాలరాజు అన్నారు. పాఠశాలలో యోగాభ్యాసం తరగతులను నివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు యోగాసనాలు ఆవశ్యకతను వివరించారు.



కంచిలి: చిన్నారులకు యోగాసనాలు నేర్పిస్తున్న హెచ్ఎం బాలరాజు

50 మంది రక్తదానం



కంచిలి: శిబిరాన్ని ప్రారంభిస్తున్న జడ్జి సురేష్ కుమార్

కంచిలి: ప్రపంచ రక్తదానం దినోత్సవాన్ని పురస్కరించుకొని మండపల్లి గ్రామంలోని వాన ప్రస్థాశ్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ, సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రాణదాత బ్లడ్ బ్యాంకు సౌజన్యంతో మెగా రక్తదాన శిబిరాన్ని శనివారం నిర్వహించారు. శిబిరాన్ని తలసేమియా బారిన పడిన పసిబిడ్డలను కాపాడేందుకు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరాన్ని ఆరవ అదనపు జిల్లా జడ్జి కె.సురేష్‌కుమార్ ప్రారంభించగా.. 50 మంది యువకులు రక్తదానం చేశారు. సోంపేట సీఐ బి.మంగరాజు పాల్గొన్నారు.

రక్తదానానికి యువత ముందుకురావాలి

సోంపేట: రక్తదానానికి యువత ముందుకు రావాలని ఎస్ఎస్‌సేవ ఫౌండేషన్ వ్యవస్థాపకులు దుద్ది శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా సోంపేటలో ఎస్‌జీఎఫ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తాన్ని దానం చేసి ఆదర్శంగా నిలిచారు. సామాజిక ఆస్పత్రి విశ్రాంత సూపరింటెండెంట్ ఇ.లక్ష్మీనారాయణ, ఎస్‌జీఎఫ్ సభ్యులు వంశీ, సాయి, సురేష్, రామారావు, వాసు పాల్గొన్నారు.



సోంపేట: రక్తదానం చేస్తున్న యువకుడు

కార్మికుల రక్తదానం

కాశీబుగ్గ: రక్తదాతల దినోత్సవం సందర్భంగా పలాసలోని జీడి కార్మికుల భవనంలో 20 మంది జీడి కార్మికులు రక్తదానం చేశారు. కాశీబుగ్గ డీఎస్పీ వెంకటఅప్పారావు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కార్మిక సంఘ అధ్యక్షులు అంబటి క్రిష్ణమూర్తి, ఆ నలుగురు ట్రస్ట్ సభ్యులు సానా ఈశ్వరరావు, టెంక తేజేశ్వరరావు, రాజు, సింహాచలం, రాము, నాగేశ్వరరావు, మోహన్ ఉన్నారు.



కాశీబుగ్గ: రక్తదాన శిబిరంలో అతిథులు, రక్తదాతలు

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి



నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ విజయకుమార్

టెక్కలి రూరల్: గ్రామీణ ప్రాంతాలలో ఉండే ప్రజలు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని టెక్కలి సీఐ ఎ.విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని పెద్దసాన పంచాయతీ పరిధి చిన్న లక్ష్మీపురం గ్రామంలో సంకల్పం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు అనేక విధాలుగా మోసాలకు పాల్పడుతున్నారని..ఇలాంటివారి వలలో పడుకండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏటీఎంల వద్ద కూడా చాలామంది మోసాలకు పాల్పడుతున్న నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల బారినపడుకుండా నిబంధనలు పాటించాలన్నారు. గ్రామ పెద్దలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గ్రంథాలయ పరిరక్షణ కోసం ధర్నా

టెక్కలి: జిల్లా కేంద్రంలోని కేంద్ర గ్రంథాలయాన్ని పరిరక్షించాలని కోరుతూ ఆదివారం ధర్నా నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ సంస్థ మాజీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు టి.వైకుంఠరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. గ్రంథాలయ ఆస్తుల పరిరక్షణ పేరుతో అన్యాక్రాంతం చేసే ప్రయత్నాలు కొంతమంది చేస్తున్నారని.. దీన్ని అడ్డుకోవడం కోసం నిర్వహిస్తున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సర్పంచ్‌ల పిల్లలకు 'తల్లికి వందనం' ఎగనామం తగదు



చింతాడ శ్రీనివాసరావు

నందిగాం: సర్పంచ్‌లకు గౌరవవేతనం ఇస్తున్నామనే నెపంతో వారి పిల్లలకు తల్లికి వందనం ఇవ్వకపోవడం దారుణమని దేవళభద్రకు చెందిన దళిత నాయకుడు చింతాడ శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో సర్పంచ్‌లుగా ఉన్నత వర్గాల వారితో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన వారు అధికంగా ఉన్నారని.. అలాంటి వారి పిల్లల చదువుకు ప్రభుత్వం సహకరించకపోవడం విడ్డూరమని అన్నారు. ఎన్నికల సమయంలో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ అని చెప్పి ఇప్పుడు సర్పంచ్‌ల పిల్లలకు ఇవ్వకుండా ఎగనామం పెట్టడం ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. లబ్ధిదారుల సంఖ్య తగ్గించడం కోసమే ఇలా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి ఎస్సీ, ఎస్టీ, బీసీ సర్పంచ్‌ల పిల్లలకు పథకంలో చేర్చాలని డిమాండ్ చేశారు. లేదంటే రిజర్వేషన్లను తుంగలో తొక్కే ప్రభుత్వంగా కూటమి సర్కార్ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

కారు బోల్తా



క్రేన్ సాయంతో కారును తీస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిని జగనన్న కాలనీలో వద్ద శనివారం కారు బోల్తా పడింది. స్థానికంగా ఉన్న ఓ యువకుడు కారుతో వస్తుండగా.. సరైన రోడ్డు లేకపోవడంతో అదుపుతప్పి గుంతలోకి కారు బోల్తా పడింది. కారు నడుపుతున్న యువకుడు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు క్రేన్ సాయంతో కారును గుంతలోనుంచి బయటకు తీశారు.

స్కేటింగ్ పోటీలకు తోషిణి రాయ్ ఎంపిక



కాశీబుగ్గ: పలాసకు చెందిన తోషిణి రాయ్ ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో జరగనున్న ఐస్ స్కేటింగ్ క్లబ్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 18 నుంచి 28వ తేదీ వరకు జరగనున్న పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున తోషిణిరాయ్ పాల్గొంటుందని కోచ్ బి.చంద్రవతి శుక్రవారం తెలిపారు.

సర్కార్ బడుల్లో పిల్లలను చేర్పించండి



పిల్లలను సర్కార్ బడుల్లోనే చేరి్పంచి మన ఊరు బడిని మనం సంరక్షించుకోవాలని స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్.. ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాడు ప్రకాశరావు అన్నారు. మహిళా సంఘాలతో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామంలో ఉన్నత, మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఉన్నప్పటికీ గ్రామం నుంచి వంద మందికిపైగా పిల్లలను వారి తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తునారన్నారు. ఈ ఏడాది తమ పిల్లలను స్థానిక సర్కారు పాఠశాలలో చేర్పించి ఊరు బడికి చేయూతనందించాలని కోరారు. సమావేశంలో విశ్రాంతి ప్రధానోపాధ్యాయుడు బాకి ఢిల్లీరావు, ఉపాధ్యాయులు కామరాజు, లోహిదాస్, హేమంత్ పాల్గొన్నారు.

–ఇచ్ఛాపురం రూరల్

వృద్ధులపై నిర్లక్ష్యం వద్దు



వృద్ధులపై ఎటువంటి నిర్లక్ష్యం చేయవద్దని ఆరో అదనపు జిల్లా జడ్జి కె.కిశోర్‌బాబు అన్నారు. శనివారం ప్రపంచ వృద్ధుల దుర్వినియోగం అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకొని కంచిలి మండలం మండపల్లి గ్రామంలో సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వానప్రస్థాశ్రమం ఆవరణలో వృద్ధుల కోసం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. వృద్ధుల దుర్వినియోగం అనగా శారీరక, మానసిక వేధింపులు, వస్తు దోపిడీ, నిర్లక్ష్యం, లైంగిక వేధింపులకు పాల్పడటం చేయరాదన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వృద్ధులను రక్షించడం, సంక్షోభ సమయంలో వారిపై దృష్టి పెట్టి వారిని కాపాడటం ఈ దినోత్సవం ప్రాముఖ్యతగా వివరించారు. సోంపేట సీఐ బి.మంగరాజు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

–కంచిలి

జంగిల్ క్లియరెన్స్



వర్షా కాలాన్ని దృష్టిలో పెట్టుకుని రైల్వే సిబ్బంది అప్రమత్తమయ్యారు. మూడురోజులుగా జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. దీనిలో భాగంగా శనివారం టెక్కలి-గుణపూర్ రైల్వే ట్రాక్‌కు ఇరు వైపుల ఉన్న భారీ చెట్లను తొలగించే పనులు చేపట్టారు. వర్షా కాలంలో ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడినప్పుడు ట్రాక్ పక్కగా ఉన్న చెట్లు పడి రైళ్ల రాకపోకలకు అంతరాయం కలగుండా, అలాగే ట్రాక్ పైనుంచి ఉండే విద్యుత్ లైన్లపై చెట్లు పడిపోకుండా ముందుజాగ్రత్తగా జంగిల్ క్లియరెన్స్ పనులు చేపడుతున్నట్లు సిబ్బంది తెలిపారు.

–టెక్కలి రూరల్

ఆలిండియా స్థాయిలో మెరిసిన..
అరసవల్లి కుర్రాడు

● నీట్ ఫలితాల్లో 64వ ర్యాంకు సాధించిన పొదిలాపు అవినాష్
● వెల్లువెత్తిన అభినందనలు

శ్రీకాకుళం న్యూకాలనీ: అరసవల్లి సమీపంలో నివాసంటున్న పొదిలాపు అవినాష్ నీట్ యూజీ–2025 ఫలితాల్లో సత్తాచాటాడు. శనివారం వెలువడిన ఫలితాల్లో ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 64వ ర్యాంకు సాధించాడు. 720 మార్కులకుగాను 652 మార్కులు సాధించి రాష్ట్రంలో టాప్ 5 జాబితాలో చోటు దక్కించుకోవడంతోపాటు శ్రీకాకుళం జిల్లా నుంచి ఆల్‌టైం రికార్డు సృష్టించి జిల్లాకు గర్వకారణంగా నిలిచాడు. ఎంతోమంది విద్యార్థులకు ఆదర్శంగా నిలిచాడు. అరసవల్లి ఖాజీపేటకు వెళ్లేదారిలో నివాసముంటున్న పొదిలాపు శ్రీనివాసరావు, భారతి దంపతుల కుమారుడే అవినాష్. తండ్రి మెడికల్ బిజినెస్ చేస్తుండగా, తల్లి గృహిణి. చెల్లి అవంతిక ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది.

చదువులో ఆణిముత్యం..

అవినాష్ 1 నుంచి 5వ తరగతి వరకు గీతాంజలి స్కూల్, 6 నుంచి 10వ తరగతి వరకు విజయనగరంలోని కోరుకొండ సైనిక్ స్కూల్‌లో చదివాడు. డాక్టర్ కావాలనే కలను సాకారం చేసుకునేందుకు విజయవాడలోని గోశాలలో శ్రీచైతన్య జూనియర్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్‌లో చేరి బైపీసీ పూర్తిచేశాడు. రెండేళ్లు ప్రణాళికాబద్ధంగా చదివి ఆలిండియా ఓపెన్ కేటగిరి స్థాయిలో 64వ ర్యాంకు సాధించడంతో అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

సంతోషంగా ఉంది..



నీట్ యూజీ–2025 ఫలితాల్లో ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 64వ ర్యాంకు సాధించడం సంతోషంగా ఉంది. తల్లిదండ్రులు, ఫ్యాకల్టీ ప్రోత్సాహం మరువలేనిది. నిరుపేదలకు అండగా ఉంటూ డాక్టర్‌గా సేవలు అందించాలనేది నా కోరిక.

– పొదిలాపు అవినాష్, 64వ ర్యాంకర్

ఆనందంగా ఉంది..



మా కుమారుడు నీట్ ఫలితాల్లో ఆలిండియా ఓపెన్ కేటగిరిలో జాతీయస్థాయిలో 64వ ర్యాంకు సాధించడం ఆనందంగా ఉంది. కష్టపడి చదివాడు. మంచి ర్యాంకు సాధించాడు. సైనిక్ స్కూల్‌లో టెన్త్ వరకు చదివి క్రమశిక్షణను అలవర్చుకున్నాడు.

– శ్రీనివాసరావు, భారతి(తల్లిదండ్రులు)

నగరంలో పెరిగిన చోరీలు

● ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
● విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివేకానంద



మాట్లాడుతున్న డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలో ఇటీవల కాలంలో దొంగతనాలు, చైన్‌స్నాచింగ్‌లు అధికంగా జరుగుతున్నాయని.. ప్రజలు అప్రమత్తంగా ఉంటే చాలావరకు నేరాలను అరికట్టవచ్చని డీఎస్పీ సీహెచ్ వివేకానంద అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు అవగాహన పెరిగేలా పోలీసు శాఖ తరపున కొన్ని సూచనలిస్తూ కరపత్రాలు పంపిణీ చేస్తున్నామన్నారు. సైబర్ నేరాలకు గురికాకుండా జనాలను అప్రమత్తం చేస్తున్నామని చెప్పారు. విలువైన బంగారు వస్తువులు, డాక్యుమెంట్లు బ్యాంకు లాకర్లలో పెట్టుకోవాలన్నారు. దూరప్రాంతాలకు విహారయాత్రలకు వెళ్లినప్పుడు పోలీస్‌స్టేషన్‌కు సమాచారమిస్తే ఇంట్లో ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాలు అమర్చుతారని చెప్పారు. అపరిచిత వ్యక్తుల కదలికలపై అనుమానం వస్తే 112 నంబర్‌కు తెలియజేయాలని సూచించారు. బైక్ దొంగతనాలు జరగకుండా రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. డిజిటల్ అరెస్టు పేరిట డబ్బులు దోచుకునే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడవద్దని, డిజిటల్ అరెస్టులనేవి లేవని స్పష్టం చేశారు.

11 మంది జూదరులపై కేసు నమోదు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని ఒంకులూరు పరిసర ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు శనివారం దాడులు చేశారు. ఈ సందర్భంగా 11 మందిని అదుపులోకి తీసుకొని వీరి వద్ద నుంచి రూ. 24 వేలు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.నీహార్ తెలిపారు.

WANTED TEACHERS
S.F.S. HIGH SCHOOL, KASIBUGGA
For High School
Subject : TELUGU PANDIT
For Primary
Subject : TELUGU, ENGLISH
Note : *Salary is negotiable*
Cell : 9963266312, 9247831182